ప్రజల చేతిలో
www.ayudamdaily.com
ఆయుధం
The Common People's Voice
మంగళవారం | జులై 28, 2026 | సంపుటి : 7 | సంచిక : 52 | పేజీలు : 2

మాత్రా, సర్వమంగళగా అమ్మవారు
13వ రోజు ఉత్సవాలు – రేపు అమ్మవారికి శాకంబరీ అలంకరణ



2 లో

శభాష్ మమతా రెడ్డి
ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల ప్రాణాలు కాపాడిన డాక్టరమ్మ

- సకాలంలో సీపీఆర్ చేసి.. సరైన వైద్యం అందించి ..
- మమత సేవలకు సర్వత్రా హర్షాతిరేకాలు
- కృతజ్ఞతలు తెలిపిన మాజీ మంత్రి హరీశ్ రావు

"వైద్యో నారాయణో హరిః" అంటే వైద్యుడు దేవుడితో సమానం.. మానవులకు ప్రాణదానం చేసే శక్తి ఒక్క భగవంతుడికే ఉంటుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి తన వైద్య విజ్ఞానంతో, చికిత్సతో ఆ ప్రాణాన్ని కాపాడే వైద్యుడు కూడా దేవుడితో సమానమే. ఆదివారం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి సకాలంలో వైద్యం అందించిన డా. మమతా రెడ్డి.. సమాజంలో వైద్య వృత్తికి ఉన్న అత్యున్నత గౌరవాన్ని నిలబెట్టారు. గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన సుదర్శన్ రెడ్డికి ఒకటి కాదు.. రెండు కాదు వరుసగా తొమ్మిది సార్లు సీపీఆర్ చేసి ఆయన ప్రాణాలు కాపాడారు. నిబద్ధత, అంకిత భావంతో పనిచేసి సకాలంలో వైద్యం అందించిన డా.మమతా రెడ్డి కృషి పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

హనుమకొండ, ఆయుధం

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం ఉదయం గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురి కాగా కుటుంబ సభ్యులు ఆయనను హనుమకొండలోని రోహిణి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఎమర్జెన్సీ విభాగంలో ఉన్న గుండె వైద్య నిపుణులు డా.మమతా రెడ్డి పెద్ది సుదర్శన్ రెడ్డిని పరీక్షించి.. వెంటనే సిబ్బందికి అప్రమత్తం చేసి.. సీపీఆర్ చేస్తూ అత్యవసర చికిత్స అందించారు. సుమారు గంటా నలభై నిమిషాలు ఆగిన గుండెను తిరిగి పనిచేసేలా చేశారు. అంతా అయిపోయిందనుకున్నాక.. పునర్జన్మ ప్రసాదించిందని డా. మమతా రెడ్డికి బీఆర్ఎస్ నేతలు, పెద్ది అభిమానులు అభినందనలు తెలిపారు. కాగా, గతంలో మాజీ ఎంఎల్ఏ మార్తినేని ధర్మారావు కు గుండెపోటు సమయంలోనూ డా. మమత రెడ్డి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు.

వైద్యులను దేవుళ్లుగా పిలుస్తారు..
హరీశ్ రావు ట్వీట్

కాగా, పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రాణాలు కాపాడిన డా. మమతారెడ్డి సేవలను మాజీ మంత్రులు, హరీశ్ రావు, కేటీఆర్‌లు కొనియాడారు. ఈ మేరకు డా.మమతారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హరీశ్ రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. డాక్టర్లను దేవుళ్లుగా ఎందుకు కొలుస్తారో.. డా.మమతా రెడ్డి అంకిత భావం, నిబద్ధతను చూస్తే అర్థమవుతుందన్నారు. ఆమె అందించిన సేవలు ప్రతిఒక్కరికీ స్ఫూర్తిదాయకం అని హరీశ్ రావు పేర్కొన్నారు.

ఏమైనా చేయండి... మా పెద్దిని కాపాడండి
- వైద్యులను కోరిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచన

హైదరాబాద్, ఆయుధం: 'ఎంజేస్తరో చేయండి.. మా పెద్దిని కాపాడండి' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులను కోరారు. సోమవారం ఆయన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేసీఆర్.. దేవుడున్నాడు, డాక్టర్లున్నారు.. అన్నీ సవ్యంగానే జరుగుతాయి. గుండె చెదరొద్దు ధైర్యంగా ఉండండి పెద్ది భార్యా పిల్లలు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి చికిత్స అందుతున్న ఐసీయూ వార్డుకు చేరుకొని, డాక్టర్లతో కలిసి పెద్దికి అందుతున్న చికిత్సా విధానాన్ని పరిశీలించారు. డాక్టర్లతో మాట్లాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యున్నత చికిత్సను అందిస్తున్నామని, అవసరమైన మేరకు విదేశాల నుంచి కూడా డాక్టర్లతో కన్సల్టెన్సీ తీసుకుంటున్నామని డాక్టర్లు తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు మిగతా అవయవాలు అన్నీ పనిచేస్తున్నాయని కాకపోతే కొంత బ్రెయిన్ ఇంకా పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని.. మరో 48 గంటలు (మిగతా 2 లో..)

వన్నాలకు ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు

వరంగల్, ఆయుధం: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.వన్నాల వెంకటరమణ ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. బీజేపీ రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్, రాష్ట్ర మెడికల్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "తెలంగాణ ఆరోగ్య సంరక్షణ విధానంపై రాష్ట్ర స్థాయి సదస్సు" ధన్వంతరి ఎక్సలెన్స్ అవార్డ్స్ లో ముఖ్య అతిథులు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, శాసనసభ్యులు రాకేష్ రెడ్డి, పాల్వాయి హరీష్ , మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జి మురళీధర్ రావు హాజరయ్యారు. రాష్ట్రం లోని సుమారుగా 500 మంది డాక్టర్లు హాజరైన ఈ కార్యక్రమంలో అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ పాల్గొన్నారు. పలు డాక్టర్లకు అవార్డ్ ప్రదానోత్సవం లో ముఖ్య అతిథులతో కలిసి వెంకటరమణ పాల్గొన్నారు. ఈ అవార్డ్ కు డాక్టర్ వన్నాల వెంకట రమణ ను కూడా ఎంపిక చేసి, అవార్డును ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

సహకార సంఘాలు నాణ్యమైన సేవలు అందించాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- కల్పలత సూపర్ బజార్ సొసైటీ ఆకస్మిక తనిఖీ

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ నగరం లోని రంగంపేట వద్ద ఉన్న కల్పలత సూపర్ బజార్ సహకార సంఘాన్ని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సోమవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. సూపర్ బజార్‌లో వినియోగదారులకు అందిస్తున్న సేవలు, సరుకుల లభ్యత, నిర్వహణ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ పనితీరును తనిఖీ చేసి, ఇంధన విక్రయాలు, నిర్వహణ, సిబ్బంది విధులు, రోజువారీ లావాదేవీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సూపర్ బజార్‌లోని టెక్స్‌టైల్స్ విభాగాన్ని పరిశీలించి, ముఖ్యంగా చేనేత వస్త్రాలు, చేనేత చీరలు తదితర ఉత్పత్తుల నాణ్యత, విక్రయాలు, నిల్వల వివరాలను తెలుసుకున్నారు. చేనేత ఉత్పత్తులకు ప్రజల్లో మరింత ఆదరణ పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అక్కడే ఉన్న ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ సజావుగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సహకార సంఘ సభ్యుల సంఖ్య, సంఘ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వ్యయాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా సహకార సంఘాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లా సహకార అధికారి బి. మోహన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సంధ్యారాణి, ఆడిట్ అధికారి కోదండరామ్ పాల్గొన్నారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ
- హైడ్రా కమిషనర్ స్థానం నుంచి రంగనాథ్‌ను తప్పించాలని సీఎస్‌కు ఆదేశం
- కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం సరికాదన్న హైకోర్టు
- హైకోర్టుకు క్షమాపణలు చెప్పిన రంగనాథ్

హైదరాబాద్, ఆయుధం: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. సెక్రటరీ ర్యాంకు స్థానంలో ఉన్న అధికారి కోర్టు ధిక్కరణ సరికాదన్న హైకోర్టు రంగనాథ్‌పై 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను ఓ ఉన్నతాధికారి ఇన్నిసార్లు ధిక్కరించడం సరికాదని పేర్కొంది.

ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించిన హైకోర్టు :

ఏవీ రంగనాథ్‌పై ప్రస్తుతం 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఉన్నట్లు హైకోర్టు పేర్కొంది. ఒక ఉన్నతాధికారిపై ఇన్ని పిటిషన్లు ఉండటంపై న్యాయస్థానం తీవ్ర ఆశ్చర్యం, అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇన్ని కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎందుకు వచ్చాయని ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది.

ఏవీ రంగనాథ్ క్షమాపణలు

అంతకుముందు కోర్టు ధిక్కరణ పిటిషన్ విచారణలో భాగంగా ఏవీ రంగనాథ్ తెలంగాణ హైకోర్టుకు బేషరతుగా క్షమాపణలు చెబుతూ అఫిడవిట్ దాఖలు చేశారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా లోతుకుంట పరిధిలోని 40 ఎకరాల భూవివాదంలో కోర్టు స్టే ఉత్తర్వులు ఉన్నప్పటికీ హైడ్రా అధికారులు జోక్యం చేసుకున్నారంటూ శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఆదేశాల మేరకు ఆయన ఈ అఫిడవిట్‌ను సమర్పించారు.

పిటిషనర్ అవాస్తవాలు చెప్పారు

కోర్టులు, న్యాయవ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. వివాదాస్పద 40 ఎకరాల స్థలంలోకి హైడ్రా వెళ్లలేదని, పిటిషనర్ అవాస్తవాలు చెబుతున్నారని ఆయన కోర్టుకు వివరించారు. పిటిషనర్ అవాస్తవాలు చెప్పారని తెలిపారు. అయినప్పటికీ, కోర్టు ఆదేశాల మేరకు బేషరతుగా క్షమాపణలు తెలుపుతూ లిఖితపూర్వక అఫిడవిట్ సమర్పించారు.

హైకోర్టు తాజా సంచలన ఆదేశం

కోర్టు ఉత్తర్వులను పదే పదే ధిక్కరిస్తున్నారనే అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి వెంటనే తొలగించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును ఆదేశించింది. గతంలో శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ దాఖలు విచారణలో కూడా ప్రైవేట్ ఆస్తిలో జోక్యం చేసుకోరాదంటూ న్యాయస్థానం ఉత్తర్వులున్నా, పదే పదే కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్న హైడ్రా తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నీటి వనరులు, నాలాలు, కాలువల రక్షణకు చేపడుతున్న చర్యలు అభినందనీయమే కానీ, ఇలా కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల భూముల్లోకి దూసుకువెళ్లడం సరికాదని వ్యాఖ్యానించింది.

చట్ట ప్రకారమే విధులు నిర్వర్తించాలి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు నిర్ణయాన్ని బీఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్ స్వాగతించారు. పేదల ఇళ్లపై ప్రతాపం చూపేందుకే సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా ఏర్పాటు చేశారని, 63 కోర్టు ధిక్కరణ కేసులు హైడ్రా కమిషనర్ వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. లోతుకుంట, బహదూర్‌గూడ, అమీన్‌పూర్‌లో హైడ్రా అరాచకాల చిట్టా పెద్దదని తెలిపారు. పేదలకో న్యాయం, రేవంత్ రెడ్డి సోదరుడికి ఇంకో న్యాయమా? అని ప్రశ్నించారు.

ప్రభుత్వం అసమర్థ పాలన, అవినీతికి నిదర్శనం
- బీఆర్ఎస్ నేత డా. ఎర్రోళ్ల శ్రీనివాస్

హైడ్రా కమిషనర్ వ్యవహారంలో హైకోర్టు చేసిన తీవ్ర వ్యాఖ్యలు, ఆయనపై సస్పెన్షన్‌కు దారితీసేలా ఇచ్చిన ఆదేశాలు కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అప్రజాస్వామిక పాలనకు అద్దం పడుతున్నాయి. చట్టాన్ని అమలు చేస్తున్నామనే పేరుతో ప్రజల హక్కులను కాలరాస్తూ, రాజకీయ కక్షసాధింపే లక్ష్యంగా అధికారులు వ్యవహరించారని బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచే చెబుతోంది. హైకోర్టు జోక్యంతో మా వాదనకు మరింత బలం చేకూరింది.

హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లపై బుల్డోజర్లు నడిపిస్తూ, ఒకే విధమైన ప్రమాణాలు పాటించకుండా ఎంపిక చేసిన వారిపైనే చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.

చట్టం అందరికీ సమానంగా అమలుకావాలి తప్ప, రాజకీయ ప్రత్యర్థులను వేధించే సాధనంగా మారకూడదు. ప్రజల ఆస్తులు, జీవనాధారాలతో చెలగాటమాడే విధానాలను వెంటనే నిలిపివేసి, రాజ్యాంగబద్ధంగా, పారదర్శకంగా పాలన సాగించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది.

ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ప్రజావాణిలో వివిధ సమస్యలపై 264 అర్జీలు స్వీకరణ

2 లో

ప్రజాపాలనలో అభివృద్ధిని బేరీజు వేసుకోవాలి: ఎమ్మెల్యే

2 లో

నాన్నకు ప్రేమతో..
తండ్రి అమ్మిన బైక్.. దశదిన కర్మలో ప్రత్యక్షం..
తనకు ఇష్టమైన బైకును వెతికి మరీ తెచ్చిన కొడుకులు

హనుమకొండ, ఆయుధం: తను కష్ట కాలంలో ఓ తండ్రి అమ్మిన తన ఇష్టమైన బైక్‌ను కొడుకులు తిరిగి తీసుకువచ్చారు. తండ్రి దశదిన కర్మ కార్యక్రమంలో ఆ బైక్‌ను పెట్టి తండ్రిపై ఉన్న ప్రేమ చాటుకున్నారు. హనుమకొండకు చెందిన ప్రముఖ చర్మ వైద్య నిపుణులు డాక్టర్ రమేష్ తండ్రి సూర్య నారాయణ ఇటీవల మృతి చెందారు. సోమవారం ఆయన దశదిన కర్మ కార్యక్రమం జరిగింది. తన తండ్రికి ఇష్టమైన బుల్లెట్ బండిని తీసుకువచ్చి కార్యక్రమంలో ఏర్పాటు చేసి, కుటుంబసభ్యులు, బంధువులను ఆశ్చర్యానికి గురి చేశారు. ఆయన కుమారులు నాగేందర్ లాల్, ప్రవాస భారతీయుడు, డాక్టర్ విజయ లక్ష్మి, విజయకుమార్ లు గతంలో తమ తండ్రి సూర్యనారాయణ ఇష్టంతో కొనుక్కుని నడిపిన ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా బండి ఎక్కడ ఉందొ కనుక్కొని.. దానిని కొనుగోలు చేసి తీసుకువచ్చారు. ఆయనకు ఇష్టమైన బండిని తిరిగి ఇంటికి తీసుక రావడం గర్వాంగా ఉందని డాక్టర్ రమేష్ తెలిపారు.

ఏమైనా చేయండి.. మా పెద్దిని కాపాడండి

(మొదటి పేజీ తరువాయి..)

సమయం పట్టే అవకాశం ఉన్నదని డాక్టర్లు వివరించారు. ఇటువంటి పరిస్థితుల్లో పూర్తి స్థాయిలో, స్పష్టమైన నిర్దిష్ట సమాచారం ఇవ్వడానికి మరికొంత సమయం పడుతుందని తెలిపారు. కాగా.. ఖర్చుకు వెనకాడకుండా పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడుకోవడానికి పార్టీ శాయశక్తులా కృషి చేస్తుందని కేసీఆర్ స్పష్టం చేశారు. తమ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని, దవాఖానా డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, ఎండి ఏఎస్ రావు జేఎస్ రావు భరోసా ఇచ్చారు.

ఐసీయూలో వైద్య చికిత్స విధానాన్ని పరిశీలించిన అనంతరం, కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వారికి భరోసాను, ధైర్యాన్ని కేసీఆర్ అందించారు. డాక్టర్ల కృషితో, దేవుని దయతో, ప్రజల ఆశీర్వాదంతో ఆయన కోలుకుంటాడని కేసీఆర్ గారు విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఆందోళన చెందవద్దని భార్యాపిల్లలకు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చి గుండె ధైర్యం నింపారు. అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తామని కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు.

ఈ సందర్భంగా కేసీఆర్ తో మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మారావు గౌడ్, వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ నాయకులు బాల్క సుమన్, మాలోత్ కవిత, గ్యాదరి బాలమల్లు, సతీష్ రెడ్డి, రజిని సాయి చంద్, పల్లె రవికుమార్, రాజారాం యాదవ్, వాసుదేవరెడ్డి, గజ్జెల నగేష్, చిరుమల్ల రాకేష్, ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

కొమ్మాల లో వైభవంగా వరుణయాగం

– హుండీ ఆదాయం రూ.3,79,513

గీసుకొండ, ఆయుధం: గీసుకొండ మండలంలోని శ్రీ కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం అత్యంత వైభవంగా వరుణ యాగం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు నందనం కవిత, సూర్యతండా సర్పంచ్ బానోతు రాఘవేంద్ర, కొమ్మాల గ్రామ సర్పంచ్ కన్నెబోయిన యమునా - ప్రవీణ్ దంపతులు, గ్రామ ప్రముఖులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు..

అనంతరం దేవస్థానంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి హుండీ లెక్కింపు కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకులు నందనం కవిత పర్యవేక్షణలో పారదర్శకంగా నిర్వహించారు. ఈ హుండీ ద్వారా మొత్తం రూ.3,79,513 (మూడు లక్షల డెబ్బై తొమ్మిది వేల ఐదు వందల పదమూడు రూపాయలు) ఆదాయం సమకూరినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో సూర్యతండా సర్పంచ్ బానోతు రాఘవేంద్ర, శ్రీవల్లి సేవా సమితి, వరంగల్ సభ్యులు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు

వరంగల్, ఆయుధం: శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థిని చింతం ఆద్య, జూలై 25, 26 తేదీలలో బెంగళూరులో నిర్వహించిన సౌత్ జోన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ - 2026లో విశేష ప్రతిభ కనబరిచి ఒక బంగారు పతకం ఒక వెండి పతకం సాధించారు.వరంగల్ కు చెందిన చింతం సునీల్ కుమార్,ప్రవాళిక దంపతుల కూతురు ఆద్య తైక్వాండో కోచ్ నవీన్ వద్ద శిక్షణ పొందుతున్నది.ఈ సందర్భంగా విద్యార్థినిని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ సురేష్ , వరంగల్ యోగా అసోసియేషన్ అధ్యక్షులు బొల్లిశెట్టి కమలాకర్, ఉపాధ్యక్షులు పాకాల రవి,తైక్వాండో కోచ్ నవీన్ అభినందించారు.భవిష్యత్తులో మరెన్నో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

బల్దియా ప్రజావాణిలో 104 ఫిర్యాదులు

వరంగల్, ఆయుధం: గ్రీవెన్స్ దరఖాస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని జీ డబ్ల్యు ఎం సి ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అదనపు కమిషనర్ తో పాటు వివిధ విభాగాలకు చెంది ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను స్వీకరించి వాటిని ఆయా విభాగాల కు చెందిన అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ కు 36, ఇంజనీరింగ్ 37, రెవిన్యూకు 8, హెల్త్ & శానిటేషన్ కు 10, నీటి సరఫరా కు 13చొప్పున మొత్తం 104 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రాజ్ కుమార్, సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఇంచార్జి సిపి రవీందర్ రాడేకర్, డిఎఫ్ఓ శంకర్ లింగం, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్ బాబు, హెచ్ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలసిరి ఉద్యమంగా చేపట్టాలి

హనుమకొండ, ఆయుధం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "జలసిరి" కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ ఇన్చార్ శేషాద్రి అన్నారు. సోమవారం హనస్పర్తి (టీటీడీసీ) శిక్షణ కేంద్రంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల మహిళా సభ్యులకు జలసిరి కార్యక్రమంపై అవగాహన, శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్‌డీఓ మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావం కారణంగా జిల్లాలో భూగర్భ జలాల మట్టం తగ్గే అవకాశాలు ఉన్నందున వర్షపు నీటిని ప్రతి చుక్కను ఒడిసిపట్టేలా చర్యలు చేపట్టడం అత్యవసరమని అన్నారు. జలసిరి కార్యక్రమం ద్వారా భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, నీటి వనరుల పరిరక్షణకు గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామైక్య సంఘాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, ప్రతి వీవో (Village Organization) కనీసం ఇద్దరు రైతులను చైతన్యపరిచి కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని తెలిపారు. రైతుల అంగీకారంతో గ్రామైక్య సంఘాల తీర్మానం, అంగీకార పత్రాలను సంబంధిత ఎంపీడీవోలకు సమర్పించాలని సూచించారు.

మాత్రా, సర్వమంగళ అలంకరణలో అమ్మవారు

పదమూడో రోజు శాకంబరీ ఉత్సవాలు

రేపు అమ్మవారికి శాకంబరీ అలంకరణ

వరంగల్, ఆయుధం: కాకతీయుల రాజధాని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు పదమూడవ రోజుకు చేరుకున్నాయి ఉదయం నిత్యాహ్నికం అనంతరం తిథిమండల దేవతా యజనంలో భాగంగా కాళీ క్రమాన్ననుసరించి అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తిని మాత్రా గాను షోడశీ క్రమాన్ననుసరించి జ్ఞానశక్తిని సర్వమంగళ గాను అలంకరించి పూజారాధనలు జరిపారు. దశమహావిద్యలలో అద్యవిద్యయైన కాళీ సపర్యాక్రమంలో త్రయోదశికి అధిదేవత మన్మథుడు. పంచతన్మాత్రల నుండి పంచభూతములు పుట్టినవి. పంచభూతముల యందు అనగా ఆకాశ, వాయు, తేజో, జల, పృథ్వీ యందు వాటి సూక్ష్మాంతరములైన గుణములు

వరుసగా శబ్ద, స్వర్శ, రూప, గంధముల రూపమున అమ్మవారు వ్యాపించి యున్నది. అట్టి సమస్త జీవుల నర్వేంద్రియుల యందు ఆధార శక్తియై అమ్మవారు వ్యాపించి యున్నది. అమ్మవారి ఒక్క విభూతియే ఈ మాత్రా నర్వమంగళా నిత్యా అమ్మవారు భక్తులకు నమస్త మంగళములను, శుభములను ప్రాప్తింపజేస్తుందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు.

29న శాకంబరీ అలంకరణ

ఈనెల 29న బుధవారం భద్రకాళి మాతను శాకంబరిగా అలంకరించనున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుండి నిత్యాహ్నికం అనంతరం అమ్మవారికి శాకములతో శాకంభరీ అలంకారము ప్రారంభమగును. అలంకారము జరుపుచున్న సందర్భములో భక్తులు అమ్మవారిని దర్శించుకొనుట వీలుపడదు. అమ్మవారి అలంకారమునకు సుమారు 6 గంటల వ్యవధి పట్టును. పూజానంతరం ఉదయం 9 గంటల నుండి నర్వదర్శనమునకు భక్తులను అనుమతిస్తారు. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు విశిష్ట దర్శనం, అతి శీఘ్రదర్శనం. ధర్మ దర్శనం క్యూలైన్లు యధాపూర్వం ఏర్పాటు చేశారు. భక్తులకు శ్రీ భద్రకాళీ అమ్మవారి శాకంభరీ విశ్వరూప దర్శనం ప్రారంభమై రాత్రి వరకు ఉంటుందని తెలిపారు. భద్రతా, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు మట్వాడ సి.ఐ కరుణాకర్, ఎస్ ఐలు పోలీసు సిబ్బందితో ఈ.ఓ రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు, హరనాథ్ పరిశీలించారు. బుధవారం ఉదయం 11 గంటలకు వ్యాస పూజ, మహాపూర్ణాహుతి, బలిప్రదానం, అవబృధంతో శాకంభరీ ఉత్సవ పరిసమాప్తి జరుగుతుందని తెలిపారు.

ప్రముఖుల పూజలు

అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాడర్ సీనియర్ ఐ.ఏ. ఎస్ అధికారి సునీత, ఐ.ఏ. ఎస్ దంపతులు సందర్శించారు. ఆలయానికి విచ్చేసి, సునీత, IASకు ఆలయ ఈ.ఓ రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఘనస్వాగతం పలికారు. పూజానంతరం ఆలయస్నపన మండపలంలో మహదాశీర్వచనం నిర్వహించి ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్.డి.ఓ. వెంకన్న, టూరిజం అధికారి శివాజీ, తహశీల్దార్ రవీందర్ తదితరులున్నారు. అనంతరం శ్రీనివాస మంగాపురం చిత్రం హీరో గట్టమనేని జైకృష్ణ, దర్శకుడు అజయ్ భూపతి మరియు చిత్రం యూనిట్ సభ్యులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. పూజానంతరం అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించారు.

వరంగల్ విద్యా అభివృద్ధిపై పార్లమెంట్‌లో ప్రశ్నించిన

ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వరంగల్, ఆయుధం: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్, భౌతిక మౌలిక వసతుల కల్పనపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో ప్రస్తావించారు. సమగ్ర శిక్ష పథకం అమలు, డిజిటల్ విద్య విస్తరణ, పాఠశాలల మౌలిక వసతుల అభివృద్ధి, కేంద్ర నిధుల కేటాయింపులపై సమగ్ర వివరాలు కోరారు.

గత కొంతకాలంగా వరంగల్‌లో ప్రభుత్వ విద్య బలోపేతం, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల పెంపు అంశాలను నిరంతరం పార్లమెంట్‌లో ప్రస్తావిస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తాజాగా డిజిటల్ విద్యా మౌలిక వసతులపై కేంద్రాన్ని ప్రశ్నించారు. తెలంగాణతో పాటు వరంగల్ జిల్లాకు గత ఐదేళ్లలో కేంద్రం నుంచి అందిన సహాయం, చేపట్టిన పనులు, విద్యార్థులకు కలిగిన ప్రయోజనాల వివరాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. సమగ్ర శిక్ష పథకం కింద దేశవ్యాప్తంగా పీఎం ఈవిద్య,

దీక్ష, ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ద్వారా సాంకేతిక ఆధారిత బోధనను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాల వార్షిక కార్యాచరణ ప్రణాళికల మేరకు కేంద్రం ఆర్థిక సహాయం అందిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణకు గత ఐదేళ్లుగా డిజిటల్ విద్యా వసతుల అభివృద్ధికి గణనీయమైన మద్దతు లభించిందని కేంద్రం వెల్లడించింది. 202526 విద్యా సంవత్సరంలో రాష్ట్రానికి 1,242 ఐసీటీ ల్యాబ్‌లు, 2,036 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లకు ఆమోదం లభించగా, ఇందుకు రూ.108.98 కోట్ల మేర నిధులు మంజూరు చేసినట్లు పేర్కొంది.

ఈ మేరకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్‌లో ప్రభుత్వ విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. పార్లమెంట్ వేదికగా వరంగల్ అవసరాలను నిరంతరం కేంద్రం దృష్టికి తీసుకెళ్తున్నానని, విద్య, మౌలిక వసతులు, డిజిటల్ సదుపాయాల విషయంలో మరిన్ని నిధులు, ప్రాజెక్టులు సాధించేందుకు తన కృషి కొనసాగుతుందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలంటే డిజిటల్ వసతులు, ల్యాబ్‌లు, స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అందుకు కేంద్రం మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. వరంగల్‌ను విద్యా రంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తాము కట్టుబడి ఉన్నామని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు.



కామన్వెల్త్ గేమ్స్..

వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు మరో పతకం

జాతీయ, ఆయుధం: కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మరో పతకం సాధించింది. మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 53 కేజీల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ రజత పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో 88 కేజీలు ఎత్తిన జ్ఞానేశ్వరి.. క్లీన్ అండ్ జెర్క్ 111 కేజీలు మోసి, మొత్తంగా 199 కేజీలతో రెండో స్థానంలో నిలిచింది. ఒనోమే ఒమోలోలా (నైజీరియా) స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఆమె మొత్తం 206 కిలోల (స్నాచ్‌లో 93, క్లీన్ అండ్ జర్క్ 113 కిలోలు) బరువును ఎత్తి కామన్వెల్త్ క్రీడల రికార్డును నెలకొల్పింది. కాగా, రెబెకా గ్రౌల్స్ (కెనడా, 178 కేజీలు) కాంస్య పతకాన్ని దక్కించుకుంది.

ఈ ఫైనల్‌లో జ్ఞానేశ్వరి.. స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ రెండింటిలోనూ ఒక్క ప్రయత్నం కూడా విఫలం కాకపోవడం విశేషం. ఛత్తీస్‌గఢ్‌లోని భోండియా గ్రామానికి చెందిన 23 ఏళ్ల జ్ఞానేశ్వరి యాదవ్ రాష్ట్ర పోలీస్ శాఖలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోంది.

ప్రజాపాలనలో అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలి

- **ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**
- **రూ.1.12 కోట్లతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన**
- **ప్రతి కాలనీకి రోడ్లు, డ్రైనేజీలు అందించడమే లక్ష్యం**

హనుమకొండ, ఆయుధం: ప్రజాపాలనలో పట్టణం ఎంతగా అభివృద్ధి చెందిందో ప్రజలు ఆలోచించాలని, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను గత పరిస్థితులతో బేరీజు వేసుకోవాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 31వ డివిజన్ శాయంపేట చౌరస్తా, వాసవి కాలనీలో సుమారు రూ.1.12 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. గతంలో పట్టణ ప్రాంతాల్లో కూడా అనేక కాలనీలు గ్రామీణ వాతావరణాన్ని తలపించే పరిస్థితుల్లో ఉండేవని, రోడ్లు లేక, డ్రైనేజీలు లేక, ప్రాథమిక సౌకర్యాల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిని ప్రతి గల్లీకి, ప్రతి కాలనీకి తీసుకెళ్లే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. స్లమ్ ఏరియాలు, ఎస్సీ కాలనీలు, వెనుకబడిన ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రజలకు

ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. కాజీపేట, సోమిడి, గొపాలపురం, శాయంపేట, దీన్‌దయాళ్ నగర్, సమ్మయ్యనగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీలు మరియు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు విస్తృతంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడమే తమ లక్ష్యమని అన్నారు. గతంలో స్మార్ట్ సిటీ నిధులు వచ్చినప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించలేకపోయిన దురదృష్టకర పరిస్థితులు ఈ నగరం చూసిందని ఎమ్మెల్యే అన్నారు. ఆ నిధులను సమర్థవంతంగా వినియోగించి ఉంటే వరంగల్ నగరం మరింత అభివృద్ధి సాధించేదని పేర్కొన్నారు. ప్రస్తుతం మాత్రం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి రూపాయి ప్రజల అభివృద్ధికే ఖర్చు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్షాకాలం వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా నిధులను సాధించి, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడం సులభం కాదని, అయినప్పటికీ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, రాజకీయాలకు అతీతంగా పట్టణ పురోగతికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, అధికారులు,అభిమానులు కాలనీవాసులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా శేషాద్రి బాధ్యతలు

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ జిల్లా జడ్పీ సీఈఓగా విధులు నిర్వహిస్తున్న శేషాద్రి సోమవారం హనుమకొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కలెక్టర్ శేషాద్రికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శేషాద్రికి పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

- **ఎల్‌నీనో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి**
- **జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**
- **ప్రజావాణిలో వివిధ సమస్యలపై 264 అర్జీలు స్వీకరణ**

హనుమకొండ, ఆయుధం: హనుమకొండ జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీ ఇప్పటికే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయబడిందని, సంబంధిత శాఖల అధికారులు వాటిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో ఉండకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అదేవిధంగా హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాకు సంబంధించిన పెండింగ్ లో ఉన్న వినతులను కూడా ప్రాధాన్యంగా తీసుకొని త్వరితగతిన పరి

ష్కరించాలని ఆదేశించారు. ఎల్‌నీనో ప్రభావంతో జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జలసిరి కార్యక్రమం కింద పంట కుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి సంరక్షణ ప్రాధాన్యతపై గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహించాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, స్థానిక సర్పంచులు, రైతులు, గ్రామస్థులతో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో వరి, పత్తి వంటి అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా కందులు, పెసర, మినుములు, ఇతర ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటల ఎంపిక చేసుకునేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.

ఈ ప్రజావాణి కార్యక్రమంలో మున్సిపల్ పరిపాలన, గృహనిర్మాణం, వైద్య ఆరోగ్యం, ఉపాధి, విద్య, విద్యుత్, కార్మిక, భూగర్భ జల వనరులు, రెవెన్యూ, సంక్షేమ శాఖలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 264 అర్జీలు ప్రజలు సమర్పించారు. ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు), తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించి, ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీపై నిర్ణీత గడువులోగా పరిష్కార చర్యలు చేపట్టి, అర్జీదారులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డీఆర్‌డీఓ మీన శ్రీను, సీపీఓ సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695